
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్

జిల్లాల వార్తలు

బుధవారం 14 ఆగస్టు 2024

బీసీ బాలుర హాస్టల్‌లో ఏసీబీ తనిఖీలు

సిద్దిపేట క్రైం, ఆగస్టు 13 : సిద్దిపేటలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ వసతి గృహ నిర్వాహకులు 12 రకాల రిజిస్టర్లు నిర్వహించడం లేదని తనిఖీల్లో గుర్తించినట్లు చెప్పారు. హాస్టల్ సందర్శనకు వచ్చేవారి వివరాలు, విద్యార్థుల అటెండెన్స్ సరిగా నిర్వహించడం లేదని తెలిపారు. జూన్, జూలైలో అబ్‌స్ట్రాక్ట్ నిర్వహణ లేదన్నారు. తాము గుర్తించిన విషయాలను పై అధికారులకు రిపోర్ట్ చేస్తామని తెలిపారు.

సర్వే కోసం వెళ్లిన అధికారుల నిర్బంధం

- పంచాయతీ కార్యాలయంలో పెట్టి తాళం
- నిరసన తెలిపిన చిన్నచింతకుంట రైతులు

నర్సాపూర్, ఆగస్టు 13: సంగారెడ్డి కెనాల్ కోసం సర్వే చేయడానికి వెళ్లిన అధికారులను రైతులు అడ్డుకుని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట గ్రామంలో కాలువ నిర్మాణానికి సర్వే చేయడానికి మంగళవారం అధికారుల బృందం వెళ్లింది. పరిహారం విషయమై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు సర్వే చేయొద్దని రైతులు అడ్డుకున్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పష్టమైన హామీ ఇవ్వనందున సర్వే చేయనివ్వబోమని నిర్వాసితులు అడ్డుకున్నారు. అధికారుల బఅందాన్ని పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి బయట నుంచి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు చేరుకుని రైతులకు నచ్చజెప్పి అధికారులను విడిపించి తీసుకెళ్లారు.



మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంటలో గ్రామస్తులు నిర్బంధించిన అధికారులు

ఘనంగా రాజీవ్‌గాంధీ అమరజ్యోతి యాత్ర

సంగారెడ్డిలో స్వాగతం పలికిన జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి



సంగారెడ్డిలో రాజీవ్‌గాంధీ అమరజ్యోతి యాత్రలో కాంగ్రెస్ శ్రేణులు



సంగారెడ్డిలో రాజీవ్‌గాంధీ అమరజ్యోతి యాత్రలో జగ్గారెడ్డి, నిర్మలారెడ్డి

సంగారెడ్డి టౌన్, ఆగస్టు 13 : తమిళనాడులోని శ్రీపెదంబదూర్ నుంచి ఢిల్లీ వరకు సాగుతున్న రాజీవ్‌గాంధీ అమరజ్యోతి యాత్ర మంగళవారం నాడు సంగారెడ్డికి చేరుకున్నది. యాత్ర నిర్వాహకులు దొర్రై శ్రీనివాసప్ప ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో వాహనాలు, వందలాది మంది పార్టీ నాయకులు పాల్గొన్న ఈ యాత్రకు సంగారెడ్డిలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రపంచంలోనే అత్యంత నిబద్ధత, సేవాదృక్పథం కలిగిన నాయకుడని కొనియాడారు. ప్రపంచ శాంతి కోసం శ్రీలంకకు శాంతిదళాలను పంపిన గొప్ప నాయకుడని గుర్తుచేశారు. యువత రాజకీయాల్లో భాగస్వాములుకావాలని 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించే చట్టం తీసుకువచ్చారని చెప్పారు. దేశ రాజకీయాల్లో అనేక మార్పులకు రాజీవ్ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి జూలకంటి ఆంజనేయులు, టీపీసీసీ కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు మహర్దశ

- మరమ్మతులకు ప్రతిపాదనలు
- మూడు పీహెచ్‌సీలకు కొత్త భవనాలు
- 21 చోట్ల మరమ్మతులు అవసరమని గుర్తింపు
- అంచనాలు రూపొందించిన టీఎస్ఎంఎస్ఐడీసీ
- ప్రభుత్వానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదనలు



కొత్త భవనం అవసరమని ప్రతిపాదించిన మల్చెల్మ పీహెచ్‌సీ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 13 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మరమ్మతులు, పునరుద్ధరణ పనులపై వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించింది. సంగారెడ్డి జిల్లాలో ఏయే పీహెచ్‌సీ శిథిలావస్థకు చేరాయి? ఏయే పీహెచ్‌సీలకు మరమ్మతులు చేపట్టాలన్న దానిపై కసరత్తు చేపట్టింది. ఈమేరకు టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు అంచనాలు రూపొందించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు అందజేశారు. సదరు నివేదిక ప్రకారం ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేసినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

శిథిలావస్థలో మూడు భవనాలు

టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు రూపొందించిన అంచనాల ప్రకారం జిల్లాలో మూడు పీహెచ్‌సీలు శిథిలావస్థకు చేరాయని నివేదించాయి. అందులో జహీరాబాద్ మండలంలోని మల్‌చెల్మ పీహెచ్‌సీ, న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్ పీహెచ్‌సీ, కల్హేర్‌లోని పీహెచ్‌సీలున్నాయి. ఈ మూడు పీహెచ్‌సీలకు కొత్త భవనాలు అవసరమంటూ టీఎస్ఎంఎస్ఐడీసీ అధికారులు అంచనాలు రూపొందించారు. మరో 21 పీహెచ్‌సీల భవనాలకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందని టీఎస్ఎంఎస్ఐడీసీ గుర్తించింది. వాటిలో రాయికోడ్ పీహెచ్‌సీ, మునిపల్లి పీహెచ్‌సీ, అందోల్ మండలంలోని తాలెల్మ పీహెచ్‌సీ, కంగ్టి పీహెచ్‌సీ, నాగల్‌గిద్ద మండలంలోని కరస్‌గుత్తి పీహెచ్‌సీ, మనూర్ పీహెచ్‌సీ, నారాయణఖేడ్ మండలంలోని తుర్కపల్లి పీహెచ్‌సీ, పటాన్‌చెరు మండలంలోని భానూర్ పీహెచ్‌సీ, జిన్నారం మండలంలోని బొల్లారం పీహెచ్‌సీ, గుమ్మడిదల పీహెచ్‌సీ, కానుకుంట పీహెచ్‌సీ, ఆర్సీపురం పీహెచ్‌సీ, సదాశివపేట మండలంలోని ఆత్మకూర్ పీహెచ్‌సీ, హత్నూర మండలంలోని చింతల్‌చెర్వు పీహెచ్‌సీ, కంది పీహెచ్‌సీ, కొండాపూర్ పీహెచ్‌సీ, కోహీర్ మండలంలోని దిగ్వాల్ పీహెచ్‌సీ, బిలాల్‌పూర్ పీహెచ్‌సీ, ఝరాసంగం పీహెచ్‌సీ, మొగుడంపల్లి పీహెచ్‌సీ, న్యాల్‌కల్ పీహెచ్‌సీలున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపితే, ఆయా పీహెచ్‌సీలకు మహర్దశ పట్టనుంది.

నిఘాతోనే మత్తు పదార్థాల రవాణాకు అడ్డుకట్ట

అధికారులతో సమీక్షలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, ఆగస్టు 13: మత్తు పదార్థాల రవాణా జరగకుండా నిరంతరం నిఘా ఉంచాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల కార్మికులు ఎక్కువగా పనిచేసే పారిశ్రామిక ప్రాంతాల్లో ప్రత్యేకంగా నిఘా ఉంచాలని సూచించారు. పాఠశాలలు, కాలేజీలు, మెడికల్ షాపులు, పాన్‌షాపులు, కిరాణ దుకాణాలను పరిశీలించాలని నిర్దేశించారు. ఆయా ప్రదేశాల్లో సీసీకెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. గంజాయి సాగు చేసినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై నిఘా ఉంచాలని కోరారు. పిల్లల ప్రవర్తనలో మార్పు వచ్చినా, మత్తు పదార్థాలకు సంబంధించి అనుమానం వచ్చినా పోలీస్‌శాఖను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఈవో రాధాకిషన్, ఏడీఏ గోవింద్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కొద్దిపాటి నిర్లక్ష్యం ఫలితంగా కుటుంబాలు రోడ్డు పాలవుతాయనే విషయాన్ని గ్రహించాలన్నారు. ప్రతీ ఒక్క వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట్ల, మూలమలుపుల వద్ద సూచికబోర్డులు, హెచ్చరికల బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్లపై గుంతలను ఎప్పటికప్పుడు పూడ్చివేయాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపేవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అంతకుముందు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలను అధికారులకు కలెక్టర్ వివరించారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి



తునికిలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, ఆగస్టు 13: విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని తునికిలోని మహాత్మ జ్యోతి పూలే గురులకుల పాఠశాలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, వంట గది, తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో మాట్లడుతూ విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. గురుకులంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందజేయాలని ఆదేశించారు.

బీబీపేట పాఠశాల వద్ద ఉద్రిక్తత

- విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై దాడి



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో

కల్హేర్, ఆగస్టు 13 : బీబీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళనతో దద్దరిల్లింది. పాఠశాలకు చెందిన 24 మంది విద్యార్థులు సోమవారం మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. తమ పిల్లలు అస్వస్థతకు గురైనా సమాచారం అందించకుండా కప్పిపుచ్చేందుకు ఉపాధ్యాయులు ప్రయత్నించారని మండిపడ్డారు. మధ్యాహ్న భోజన నిర్వాహకురాలి ఇంటికి వెళ్లి ఆమెపై దాడి చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో శంకర్, కల్హేర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్ చేరుకుని విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి శాంతింపజేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన పాఠశాల హెచ్‌ఎంను డీఈవో ఇప్పటికే సస్పెండ్ చేశారని వారికి తెలిపారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీని బాధ్యతల నుంచి తొలగించినట్టు తెలియజేశారు. ఇకపై విద్యార్థులకు పెట్టే భోజనంపై శ్రద్ధ తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం వారు విద్యార్థులకు ఇచ్చిన గుడ్లు కొనుగోలు చేసిన కిరాణషాపును తనిఖీ చేశారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌వో సంధ్యారాణి, వైద్యాధికారులు రమేష్, శ్రీనివాస్, ప్రతిభ, సిబ్బందితో కలిసి పాఠశాలలో విద్యార్థులందరికి వైద్య పరీక్షలు జరిపారు. విద్యార్థుల అస్వస్థతకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు చిరంజీవి, అశోక్, సామాజిక కార్యకర్తలు గణపతి, ఆనంద్, అర్జున్, కొటారి నర్సింహులు, సాల్మన్, ఎస్పీఆర్డీ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్ తదితరులు ఆందోళన చేశారు.

హెచ్‌ఎంలకు మధ్యాహ్న భోజన బాధ్యతలు వద్దు

పాఠశాల విధులతో సతమతమవుతున్న హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ బాధ్యతల నుంచి తప్పించాలని టీపీటీఎఫ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగారం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కల్హేర్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బోధనేతర కారణాలకు ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడం తగదని అన్నారు. బీబీపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను కనీసం వివరణ కూడా తీసుకోకుండా సస్పెండ్ చేయడం దారుణమని ఖండించారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీ తప్పులకు హెచ్‌ఎంను ఎలా బాధ్యుడిని చేస్తారని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన పర్యవేక్షణను ఇతర ఏజెన్సీలకు అప్పగించాలని సూచించారు. సస్పెండ్ చేసిన బీబీపేట ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న ఆర్డీవో అశోకచక్రవర్తి

కోలుకున్న విద్యార్థులు ఇంటికి

నారాయణఖేడ్, ఆగస్టు 13: కల్హేర్ మండలం బీబీపేట జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి అస్వస్థతకు గురై నారాయణఖేడ్ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థులను మంగళవారం ఆర్డీవో అశోక చక్రవర్తి పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు పూర్తిగా కోలుకున్నారని ఆయన తెలపడంతో ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి స్వగ్రామాలకు పంపారు. ఆయన వెంట కల్హేర్ తహసీల్దార్ శివశ్రీనివాస్, ఖేడ్ ఎంఈవో విశ్వనాథ్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు సీపీఐ నాయకుల విద్యార్థులను పరామర్శించారు.

జిల్లా పోలీసుల పనితీరు భేష్

- శాంతిభద్రతల పరిరక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు
- గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం
- డీజీపీ డాక్టర్ జితేందర్



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న డీజీపీ జితేందర్

సంగారెడ్డి క్రైం, ఆగస్టు 13 : సంగారెడ్డి జిల్లాలో పోలీసుల పనితీరు బాగుందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆయన మంగళవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మల్టీజోన్-2 ఐజీ వి.సత్యనారాయణతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం జిల్లా పోలీసుల అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మట్కా, పేకాట, గంజాయి సాగు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డుప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన కూడళ్లల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. పెట్రోలింగ్ ముమ్మరంగా నిర్వహించాలని ఆదేశించారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌పై త్వరితగతిన స్పందించాలని, సాధ్యమైనంత త్వరగా ఘటనా స్థలానికి చేరుకోవాలని పేర్కొన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదగా మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని సూచించారు. జిల్లాలో మహిళల రక్షణ కోసం చేపట్టిన షై ఆటో సేఫ్ స్టిక్కరింగ్ కార్యక్రమాన్ని అభినందించారు. పరిశ్రమల రక్షణ, ఉద్యోగుల రక్షణార్థం సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ఏర్పాటు చేయడంతో ఉపయోగం ఉంటుందని అభినందించారు. సమావేశంలో మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్, అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, డీఎస్పీలు సత్తయ్యగౌడ్, రవీందర్‌రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ పనితీరు కనబర్చిన డీఎస్పీ రామ్మోహన్, సీఐలు శివలింగం, మల్లేశం, రమేష్, విజయకృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్‌లతో పాటు ప్రభాకర్, జానకీరామ్, హన్మిరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కల్యాణి, వెంకటేశం, విజయ్ పవార్‌లకు డీజీపీ రివార్డులను అందజేశారు.

దేశ సమగ్రతను కాపాడే బాధ్యత అందరిది

- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు
- జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



మెదక్‌లో తిరంగా ర్యాలీలో ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ అర్బన్, ఆగస్టు 13: దేశ సమగ్రతను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. మెదక్ పట్టణంలో బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో ఆయన కళాశాల విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 సందర్భంగా ప్రతీ భారతీయుడు తమ ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగరవేయాలని కోరారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన మహాత్ములను స్మరించుకోవాలని కోరారు. దేశ కోసం ప్రాణాలను అర్పించిన సుభాష్ చంద్రబోస్, శివాజీ వంటి మహనీయులను మననం చేసుకునేందుకే ప్రధాని మోదీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. భారతదేశంలోని యువశక్తికి ప్రపంచాన్ని శాసించే సత్తా ఉందని పేర్కొన్నారు. భారత దేశ ప్రజలు పరమత సహనంలో ప్రపంచానికే ఆదర్శంగా ఉన్నారని, అందుకే దేశంలో మైనారిటీలు సుభిక్షంగా ఉంటున్నారని పేర్కొన్నారు. కానీ కొదరు మీడియా, సోషల్ మీడియాలో దేశంలో ఏదో జరుగుతున్నట్టు పోస్టులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బంగ్లాదేశ్‌లో హిందువుల హక్కులను రక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులు ఎంఎల్ఎన్‌రెడ్డి, శ్రీనివాస్, నందారెడ్డి, రాగి రాములు, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, వివిధ మోర్చాల అధ్యక్షులు కాశీనాథ్, వీణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మిన ఎరువు బస్తాలను ఆన్‌లైన్లో నమోదు చేయాలి

చిన్నశంకరంపేట, ఆగస్టు 13: రైతులు కొనుగోలు చేసిన ప్రతీ ఎరువు బస్తాను ఆన్‌లైన్లో పేర్లను నమోదు చేయాలని మెదక్ ఏడీఏ విజయనిర్మల సొసైటీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు గవ్వలపల్లి గ్రామాల్లోని ఆగ్రోస్ కేంద్రాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం చిన్నశంకరంపేట సొసైటీ గోదాంలలో ఎరువు బస్తాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె సొసైటీలో ఎరువు బస్తాలను ఆన్‌లైన్లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. మొబైల్ యాప్‌పై సొసైటీ సిబ్బందికి అవగాహన కల్పించారు.

ఒకే చోట ప్రభుత్వ కార్యాలయాలు: పాండురంగారెడ్డి

పటాన్‌చెరు, ఆగస్టు 13: అమీన్‌పూర్ మున్సిపాలిటీలో ఒకేచోట ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల నిర్మాణం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తహసీల్దార్ రాధతో కలిసి మున్సిపల్ పాలకమండలి ప్రభుత్వ పాఠశాలకు కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. గతంలో మున్సిపల్ కార్యాలయం, సమీకృతకూరగాయల మార్కెట్, మినీస్టేడియం నిర్మాణానికి స్థలాలను కేటాయించారన్నారు. తాజాగా ప్రభుత్వ పాఠశాలకు, పోలీసు స్టేషన్‌కు సైతం పక్కనే కేటాయిస్తే బహుళ ప్రయోజనాలు ఉంటాయని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు.

మెదక్ జిల్లా పాస్టర్స్ నూతన కమిటీ ఎన్నిక

మెదక్ కల్చరల్, ఆగస్టు 13: మెదక్ జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం చర్చి ఆవరణలో ఎలక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా వినయ్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్‌గా జీవరత్నం, జనరల్ సెక్రటరీగా నెల్సన్, జాయింట్ సెక్రటరీగా హెంద్రిపాల్, ట్రెజరర్‌గా ఏసుబాబును ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల నిర్వహణ గంట సంపత్, ప్రభాకర్, పార్థసారధి, లాజర్, ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో జరిగాయి. అనంతరం నూతన కమిటీలోని నూతన పాస్టర్‌లను ఘనంగా సన్మానించారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

జహీరాబాద్, ఆగస్టు 13: పంటసాగులో రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని సంగుపేట ఏరువాక శాస్త్రవేత్తలు రాహుల్‌విశ్వకర్మ, సరిత పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రంజోల్ గ్రామంలో వారు పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు సోయాపంట సాగుసమయంలో అధికారుల, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను రైతులు పొందాలన్నారు. రంజోల్ గ్రామంలో ఓ రైతు సాగుచేస్తున్న అదిలాబాద్ సోయాబీన్ 15రకం పంటను పరిశీలించారు. మిగతారకాలతో పోల్చుకుంటే ఈరకం పంట త్వరితగతిన కోతకు వస్తుందని, గింజ పరిమాణం నాణ్యతగా ఉంటుందన్నారు.

ట్రాక్టర్, కారు ఢీ

కొండాపూర్, ఆగస్టు 13: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం మునిదేవునిపల్లి గ్రామ శివారులో మంగళవారం ఇన్నోవా, ట్రాక్టర్ ఢీకొన డంతో ట్రాక్టర్ ఇంజన్ రెండు భాగాలుగా విడిపో యింది. స్థానికుల వివరాల ప్రకారం... మునిదేవు నిపల్లి నుంచి మైతాబ్‌ఖాన్‌గూడ రోడ్డుపై ట్రాక్టర్ వెళ్తుంది. ట్రాక్టర్ డ్రైవర్ విఠల్ పొలాల వద్దకు వెళ్లేందుకు ఎడమవైపు స్టీరింగ్ తిప్పాడు. అదే సమయంలో వెనకనుంచి వస్తున్న (ఎల్ఎన్‌టీ సంస్థ) ఇన్నోవా కారు అతివేగంగా ఎడమ వైపు నుంచి వచ్చి ట్రాక్టర్ ఇంజన్ మధ్య ఢీకొన్నది. దీంతో ట్రాక్టర్ ఇంజన్ రెండుగా విడిపోయి, విఠల్‌కు స్వల్ప గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


కిష్టారెడ్డి(ఫైల్)

తొగుట, ఆగస్టు 13: అప్పులబాధతో వ్యక్తి సోమవారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తొగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన తూంకుట్ల కిష్టారెడ్డి(45) సిద్దిపేటలో నివాసముంటున్నాడు. సోమవారం ఉదయం గ్రామంలో పంట చిట్టీ ఉన్నదని గ్రామానికి వచ్చాడు. చిట్టీ కట్టేందుకు డబ్బులు లేకపోవడం, అప్పులవారి వేధింపులు తాళలేక ఇంట్లోని గడ్డి మందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చిట్టీ సమయం మించిపోతున్నా కిష్టారెడ్డి ఇంకా రాలేదని గ్రహించిన అతడి బంధువు ఇంటికి వచ్చి చూసేసరికి అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే అతడిని చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కుటుంబీకులు ములుగు ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య రమ, కొడుకు విష్ణువర్ధన్‌రెడ్డి, కూతురు భాను తేజ ఉన్నారు. మృతుడి కొడుకు విష్ణువర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు మిరుదొడ్డి ఎస్ఐ పరశురాములు తెలిపారు.

క్విట్ ఇండియా ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

● ప్రొఫెసర్ కోదండరాం



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

నర్సాపూర్, ఆగస్టు 13: దేశ స్వాతంత్రం కోసం ప్రజలందరిలో జాతీయ భావం తీసుకు వచ్చి, వారు శాంతియుతంగా ఉద్యమం చేసి బ్రిటీష్ వారు వెళ్లిపోయేలా చేసిన క్విట్ ఇండియా ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కృషి విజ్ఞాన గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం క్విట్ ఇండియా జాతీయ ఉద్యమంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. ప్రిన్సిపాల్ దామోదర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ 1942లో మొదలైన క్విట్ ఇండియా ఉద్యమం దేశవ్యాప్తంగా శాంతియుతంగా పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలలో కూడా చైతన్యం తీసుకువచ్చిందన్నారు. నేటి తరం కూడా చరిత్ర కూడా తెలుసుకోవాలని అది తెలిస్తేనే వర్తమానంలో రాణిస్తామన్నారు. చరిత్రనే వర్తమానాన్ని శాసిస్తుందన్నారు. అయితే నేడు వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో పాటు మారిన కాలానుగుణంగా చరిత్ర తెలుసుకోవడానికి ఆసక్తి చూపడం లేదని తద్వారా సంస్కృతి సంప్రదాయాలు మరిచిపోతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవులరాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ తదితరులు మాట్లాడుతూ నేటి యువతరానికి చరిత్ర తెలుసేలా కృషి విజ్ఞాన సంస్థ అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన సంస్థ అధ్యక్షులు లక్ష్మీకాంతరావు, మాజీ ఎస్పీ మల్లారెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌గౌడ్, లలిత, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, సుదర్శన్‌గౌడ్, నరేందర్‌రెడ్డి,మణిదీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. సెమినార్ సందర్భంగా క్విట్ ఇండియా ఉద్యమంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించగా అందులో ప్రతిభ చూపిన వారికి సంస్థ తరుపున సత్కరించి చరిత్రకు సంబంధించిన పుస్తకాలను బహూకరించారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ శోభారాణి


సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి

జగదేవ్‌పూర్, ఆగస్టు 13: మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ప్రత్యేక శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి అన్నారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని పీస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పాత పంటల సాగు, జీవవైవిధ్య పంటల సాగుపై మహిళలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇష్టమైన రంగంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించి, వారి ఆర్థిక ఎదుగుదలకు తోడ్పాటునందిస్తున్నదని చెప్పారు. హైదరాబాద్‌లోని చార్మినార్ ప్రాంతంలో పైలెట్ ప్రాజెక్టుగా 100 మంది మహిళలకు ఈ ఆటో కార్యక్రమం ద్వారా ఎనిమిది వారాల పాటు ప్రత్యేకంగా ఎలక్ట్రిక్ ఆటో డ్రైవింగ్ శిక్షణ అందించి, వారికి త్వరలోనే ఎలక్ట్రిక్ ఆటోలు సైతం అందించనున్నట్లు తెలిపారు. జగదేవ్‌పూర్ ప్రాంతంలో త్వరలోనే ఈ ఆటో శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, అరుణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కవితారెడ్డి, అమర రాము, పీస్ సిబ్బంది మహేష్, పద్మ, వెంకట్‌లక్ష్మి, శోభ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జగదేవ్‌పూర్ మండలం తిగుల్ నర్సాపూర్ గ్రామ సమీపంలోని కొండపోచమ్మ అమ్మవారిని శోభారాణి దర్శించుకున్నారు.

నేటి నుంచి నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో పవిత్రోత్సవాలు

● 14 నుంచి 17 వరకు ఉత్సవాలు..
● తరలిరానున్న వందలాది మంది భక్తులు


పవిత్రోత్సవాల సందర్భంగా ముస్తాబైన నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం

వర్గల్, ఆగస్టు 13: సిద్దిపేట జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో 14 నుంచి 17వ తేదీవరకు స్వామివారి పవిత్రోత్సవాలు జరగనున్నాయి. క్షేత్రంలో నాలుగురోజుల పాటు జరిగే వేడుకలకు ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణంలో మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలను అలంకరింపజేశారు. 14న సాయంత్రం ఆలయంలో 6.30 గంటలకు పవిత్రోత్సవాలకు అంకురార్పణ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 15న ఉదయం 8.30 గంటలకు ఆలయ యాగశాలలో అగ్నిప్రతిష్ఠ, మూర్తి కుంభస్థాపన, పవిత్ర అధివాసం, పవిత్రారోపణము, సాయంత్రం 5 గంటలకు మూలమంత్ర హోమం, ద్రావిడ ప్రబంధ పారాయణములు నిర్వహిస్తారు. 16న ఉదయం మూలమంత్ర హవనం, ద్రావిడ ప్రబంధపారాయణము, 17న ఉదయం మహా పూర్ణాహుతి, పవిత్ర అవరోపనము, మూరికుంభప్రోక్షణ, ద్రావిడ ప్రబంధ పారాయణములు నిర్వహిస్తారు. వేడుకలకు భక్తులు వందల సంఖ్యలో తరలిరానున్నారు. భక్తులు రద్దీ దృష్ట్యా ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు.

జల్సాలకు అలవాటు పడి బైక్‌లు చోరీ

● నిందితుడి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు


వివరాలను వెల్లడిస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

చేగుంట, ఆగస్టు 13: జల్సాలకు అలవాటుపడి పార్క్ చేసిన బైక్‌లను చోరీచేస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం తెల్లవారుజామున రహదారిపై ఎస్ఐ బాలరాజ్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో మాసాయిపేట మండల కేంద్రానికి చెందిన మోతి జనార్ధన్ బైక్‌పై వెళ్తున్నాడు. అతడిని ఆపుతున్న సమయంలో బైక్‌ను వదిలి వెళ్లడానికి ప్రయత్నించాడు. పట్టుకుని విచారించగా.. బైక్‌లను చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అతని స్నేహితులు రేపల్లి లక్ష్మణ్, చింతల జగన్ కూడా ఏ పని చేయకుండా పార్కింగ్ చేసిన వాహనాలను చోరీచేసి డబ్బులు సంపాదిస్తున్నట్లు తెలిపాడు. ఒక సంవత్సరంలో చేగుంట, తూప్రాన్, మెదక్, మేడ్చల్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల్లో ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలను చోరీ చేసి, పరిచయం ఉన్న సిర్నాపల్లికి చెందిన వడ్ల శ్రీకాంత్‌కు అమ్మి వచ్చిన డబ్బులు జల్సాలకు పాల్పడుతున్నట్లు వివరించారు. జనార్ధన్ ఇంటి సమీపంలోని చెట్ల పొదల్లో దాచి ఉంచిన 15 బైక్‌లను స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ రూ.5 లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, రామాయంపేట సీఐ వెంకట్‌రాజాగౌడ్, ఎస్ఐ బాల్‌రాజ్ పాల్గొన్నారు.

రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పరిశీలించిన నాయకులు

మాసాయిపేట, ఆగస్టు 13: మాసాయిపేటలోని చెట్లతిమ్మాయిపల్లి చౌరస్తా వద్ద నిర్మిస్తున్న 23 రైల్వే గేట్ అండర్ బ్రిడ్జి పనులను మంగళవారం కాంగ్రెస్, బీజేపీ నాయకులు పరిశీలించారు. జాతీయ రహదారిపై ఉన్న ఈ రైల్వే గేటు వద్ద 2003లో జరిగిన స్కూల్ బస్సు ప్రమాదంలో 23 మంది చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. నాటి నుంచి పలు గ్రామాల ప్రజల డిమాండ్ మేరకు రైల్వే అండర్ బ్రిడ్జి పనులు చేపట్టారు. పదిహేను రోజుల క్రితం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సైతం పార్లమెంట్‌లో ఇక్కడ ఆర్‌యూబీ ఆవశ్యకతను వివరంచారు. ఈ నేపథ్యంలో ఇక్కడ పనులు ప్రారంభించేందుకు సమాయత్తమవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు కిష్టారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్, జగదీష్, నాగేందర్‌రెడ్డి, పాపన్నగారివేణు, నవీణ్ యాదవ్ తదితరులు సందర్శించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

● గతనెల 31న ఘటన.. మరుసటి రోజు ఖననం
● యువకుడి వేధింపుల వల్లేనని ఫిర్యాదు
● 13 రోజుల తర్వాత పోస్టుమార్టం


గోస్కె సుప్రజ (ఫైల్)

టేక్మాల్, ఆగస్టు 13: ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి మృతదేహాన్ని 12 రోజుల తర్వాత వెలికి తీసి మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. అయితే, విద్యార్థిని గ్రామానికి చెందిన ఓ యువకుడు ప్రేమ పేరిట వేధించడం వల్లే ఆమె ఆత్మహత్య చేసుకుందన్న ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం పూడ్చి పెట్టిన మృతదేహాన్ని బయటకు తీసి అక్కడే పోస్టుమార్టం చేయించారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం తంపులూరు గ్రామానికి చెందిన గోస్కె సుప్రజ(16) హవేళిఘనపురంలో ఉంటూ ఇంటర్ చదువుతోంది. గతనెల 30న ఇంటికి వచ్చింది. మరుసటి రోజు ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి ఉరివేసుకుంది. పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయకుండానే కుటుంబసభ్యులు ఈనెల 1న తమ సొంత పొలంలోనే ఖననం చేశారు. అయితే, గ్రామానికి చెందిన ఓ యువకుడు తన కోడలిని ప్రేమపేరుతో మానసికంగా, శారీరకంగా వేధించడంతోనే ఆత్మహత్య చేసుకుందని అనుమానిస్తూ బాలిక మామయ్య గోస్కె సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బాలిక మృతదేహాన్ని వెలికితీసి సంగారెడ్డికి చెందిన ఫోరెన్సిక్ వైద్యులు డాక్టర్ పి. వాణిశ్రీ, డాక్టర్ చంద్రదీక్‌ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. టేక్మాల్ తహసీల్దార్ కృష్ణ, అల్లాదుర్గం సీఐ రేణుక, టేక్మాల్ ఏఎస్ఐ తుక్కయ్యలు పోస్టుమార్టంను పర్యవేక్షించారు.

రోడ్డే ఆటస్థలం


సర్వీస్ రోడ్డుపై ఆటలాడుతున్న విద్యార్థులు

కోహీర్, ఆగస్టు 13: స్కూళ్లంటే ఆటస్థలాలు ఉండాలి. గురుకులాలంటే అన్ని సౌకర్యాలూ ఉంటేనే విద్యార్థులు సంపూర్ణంగా చదువుతో పాటు ఆటలూ నేర్చుకునే అవకాశం ఉంటుంది. కానీ, ఆ గురుకుల విద్యార్థులకు రోడ్డే ఆట స్థలంగా మారింది. కోహీర్ మండలం దిగ్వాల్ గ్రామంలోని 65వ జాతీయ రహదారి పక్కనే మహాత్మ జ్యోతిబాఫూలే గురుకుల పాఠశాల ఉంది. అద్దె భవనంలో నడుస్తున్న ఈ గురుకులంలో సుమారు 450 మంది విద్యార్థులు ఉండగా, వారికి ఆట స్థలం లేదు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించాలని భావించగా, మైదానం లేకపోవడంతో ఉపాధ్యాయులు జాతీయ రహదారి పక్కనే ఉన్న సర్వీస్ రోడ్డును మైదానంగా మార్చేశారు. అక్కడే వారికి పలు ఆటల్లో పోటీలు నిర్వహించారు.

సహకార సంఘాన్ని సందర్శించిన ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధుల బృందం


ప్రాథమిక సహకార సంఘం వద్ద ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధుల బృందం

బెజ్జంకి, ఆగస్టు 13: బెజ్జంకి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని మంగళవారం 9 ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వారు పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, సీఈవో ఎస్.సత్యనారాయణరావును సహకారం సంఘం పనితీరును అడిగి తెలుసుకున్నారు. సొసైటీ ద్వారా జరిగే లావాదేవీలు, ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయ రుణాలు, పెట్రోల్ బంక్, ఫంక్షన్‌హాల్ నిర్వహణ, గోల్డ్ లోన్స్, హౌసింగ్ లోన్స్ నిర్వహణపై ప్రతినిధుల బృందానికి చైర్మన్ శరత్‌రావు వివరించారు. తమ రాష్ట్రాల్లో కూడా సహకార సంఘం ద్వారా సేవలందించేందుకు ఎంతో నేర్చుకున్నామని ప్రతినిధుల బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రమేష్, డైరెక్టర్లు, బ్యాంకు మేనేజర్ ప్రవీణ్, ఫీల్డ్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, సొసైటీ సీఈవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్, ఆగస్టు 13: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డితో కలిసి మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు వచ్చిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదైన ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక కేసులను వెంటనే పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి శశికళ, ఆర్డీవోలు, పోలీసు అధికారులు, విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్టోన్ క్రషర్ పనులను నిలిపి వేయాలి

జిన్నారం, ఆగస్టు 13: రాళ్లకత్వలో ఏర్పాటు చేస్తున్న నూతన స్టోన్ క్రషర్ పనులు నిలిపి వేయాలని స్థానికులు ఆందోళన చేశారు. మంగళవారం రాళ్లకత్వ శివారు 286 సర్వే నెంబరులోని అసైన్డ్ భూమిలో కొందరు మైనింగ్‌శాఖ అనుమతులతో స్టోన్ క్రషర్ పనులు చేపట్టారని, అక్కడ గ్రామ ప్రధాన చెరువుకు వర్షపు నీటిని తరలించే వెండికుంట, చెక్ డ్యాం భూములు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళనకు పూనుకున్నారు. అసైన్డ్ భూములు, కాలువలను ఆక్రమించే ప్రయత్నాలను అడ్డుకొని, క్రషర్ ఏర్పాటుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో గ్రామస్థులు, యువకులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఈ రోడ్డుకు మోక్షమెన్నడో?

- నరకాన్ని తలపిస్తున్న చల్మెడ - నస్కల్ రోడ్డు
- ఏడాది క్రితం రూ.12 కోట్లు మంజూరు
- 4 కిలోమీటర్లు కంకర వేసి చేతులెత్తేసిన కాంట్రాక్టర్



కొద్దిపాటి వర్షానికే బురదమయమైన రోడ్డు



కంకర వేసి వదిలేసిన రహదారి పనులు

నిజాంపేట, ఆగస్టు 13: తలాపున సముద్రం ఉన్నా దప్పిక తీరదన్న చందంగా మారింది ఆ రహదారి దుస్థితి. ఏడాది క్రితమే నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగని దుస్థితి. రెండున్నర దశాబ్దాల క్రితం మారుమూల పల్లెలను కలుపుతూ మండల పరిధి చల్మెడ- నస్కల్ వరకు బీటీ రహదారి నిర్మించారు. అయితే కొన్నాళ్లుగా 18 కిలోమీటర్ల మేర రోడ్డు ధ్వంసమైంది. దీంతో వాహన చోదకులకు ఈ రహదారి నరకాన్ని తలపిస్తున్నది. దీంతో ఎనిమిది గ్రామాల ప్రజలు పలుమార్లు గత ప్రభుత్వానికి విజ్ఞప్తులు, నిరసనలు తెలియజేశారు. రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలంటూ పాదయాత్ర చేపట్టారు. ఈ నేపథ్యంలో గత ఏడాది ఈ రోడ్డు పునర్నిర్మాణానికి రూ.12 కోట్లు విడుదలయ్యాయి. అయితే సదరు కాంట్రాక్టర్ నాలుగు కిలోమీటర్ల మేర రోడ్డు తవ్వి కంకర వేసి వదిలేశాడు. ప్రభుత్వం నుంచి బిల్లులు రానందున రహదారి పనుల పరిస్థితి ఆదిలోనే హంసపాదులా తయారైంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుంటే గానీ పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడంలేదు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ రోడ్డుకు పనులకు మోక్షం కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరిగినా పట్టించుకోరా?



రోడ్డు బాగు చేయాలని నిరసనలు చేపడితే చివరకు పనులు ప్రారంభించి 10 నెలలు గడిచాయి. ఇప్పటికీ ఎలాంటి పురోగతి లేదు. కాంట్రాక్టర్ కంకర వేసి రోడ్డును మధ్యలోనే వదిలిపెట్టాడు. వాహనదారులకు ప్రమాదాలు జరిగితే గానీ అధికారులు పట్టించుకోరా?

- తీగల శ్రీనివాస్ గౌడ్, బీజేపీ జిల్లా నాయకుడు

పీఆర్సీ ఏరియర్స్ ఒకే దఫాలో చెల్లించాలి: ఎస్టీయూ

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 13: పీఆర్సీ ఏరియర్స్ ఒకే దఫాలో చెల్లించాలని ఎస్టీయూ(స్టేట్ టీచర్స్ యూనియన్) జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు సాబేర్‌అలీ, శ్రీనివాస్‌రాథోడ్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలోని ఎస్టీయూ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లా తృతీయ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లోని నాలుగు డీఏలు మంజూరు చేయాలని, పీఆర్సీ కమిటీ నివేదికను వీలైనంత త్వరగా తెప్పించుకొని ఉద్యోగ, ఉపాధ్యాయులను ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి రమణకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేశ్‌కుమార్, కార్యదర్శి జీవన్‌రాథోడ్, రిటైర్డ్ హెచ్‌ఎం హఫీజ్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్లకు రూ.60కోట్లు మంజూరు చేయాలి



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడి

పటాన్‌చెరు, ఆగస్టు 13: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నూతన రోడ్ల నిర్మాణం, మరమ్మతులకు రూ. 60కోట్ల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో సమావేశమై నియోజకవర్గ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొత్త రహదారుల నిర్మాణానికి రూ.43కోట్లు, ప్రస్తుత రహదారుల మరమ్మతులకు మరో రూ.17కోట్లు యుద్ధప్రాతిపదికన మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్టు తెలిపారు.

మాదారం పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు



పాఠశాలలో ప్రతిష్ఠించిన సరస్వతీదేవి విగ్రహం

జిన్నారం, ఆగస్టు 13: మాదారం ప్రభుత్వ పాఠశాలలో మాజీ సర్పంచ్ సరిత సురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో సరస్వతీదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ. లక్షా20వేల వ్యయంతో సరితాసురేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 15న విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్టు తెలిపారు.

లబ్ధిదారులకు ఉజ్వల గ్యాస్ పంపిణీ



పిల్లుట్లలో గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

శివ్వంపేట, ఆగస్టు 13: నిరుపేదల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల గ్యాస్‌ను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పెద్దపుల్లి రవి తెలిపారు. మండలంలోని పిల్లుట్ల గ్రామంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల గ్యాస్ సిలిండర్లను ఏడుగురు లబ్ధిదారులకు మంగళవారం బీజేపీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, సత్యనారాయణ, రాజు శ్రీధర్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో మాజీ సర్పంచ్‌పై ఆరోపణలు

రామచంద్రాపురం, ఆగస్టు 12: తెల్లాపూర్ మాజీ సర్పంచ్, మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత భర్త సోమిరెడ్డిపై అవినీతి ఆరోపణలు అధికమయ్యాయి. తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలంటూ మంగళవారం కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో సోమిరెడ్డి ఫిర్యాదు చేశారు. ఆటోనడుపుకునే వ్యక్తికి ఇన్ని కోట్ల రూపాయలు, ఆస్తులు ఎక్కడి నుంచి వచ్చాయంటూ సోషల్ మీడియాలో పెడుతున్నారన్నారు. ఈ విషయమై విచారణ జరిపిస్తామని సీఐ పేర్కొన్నారు. కాగా ఓ బిల్డర్ వద్ద రూ. కోటి డిమాండ్ చేశారని 8వ వార్డు కౌన్సిలర్ కొల్లూరి భరత్‌కుమార్ ఆరోపించారు. ఈ అంశం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.

కేజీబీవీ పాత సామగ్రి విక్రయించే యత్నం

- వాహనంలో తరలిస్తుండగా అడ్డుకున్న స్థానికులు



పాత సామగ్రిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న వాహనం

అల్లాదుర్గం, ఆగస్టు 13: అల్లాదుర్గంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలోని పాతసామగ్రి, పాత పాఠ్య పుస్తకాలను అక్రమంగా అమ్ముకునేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్న ఘటన సోమవారం రాత్రి వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక కేజీబీవీలోని పాత సామగ్రితో పాటు, పాత పాఠ్య పుస్తకాలను విక్రయించేందుకు ఎస్‌వో స్రవంతి పెద్దశంకరంపేట పట్టణంలోని ఓ వ్యాపారితో ఒప్పందం చేసుకున్నారు. సోమవారం సాయంత్రం వాటిని ఓ వాహనంలో తరలించేందుకు సదరు వ్యాపారి సిద్ధమయ్యారు. ఇది పసిగట్టిన స్థానికులు కొందరు వాహనాన్ని అడ్డుకుని జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే ఎస్‌వోకు ఫోన్ చేసి, అనుమతి లేకుండా పాత సామగ్రి, పుస్తకాలను విక్రయించవద్దని ఆదేశించడంతో వాహనంలో లోడ్ చేసిన వాటిని తిరిగి విద్యాలయానికి చేర్చారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ పాత సామగ్రి, పాత పుస్తకాలను ప్రభుత్వ అనుమతితోనే విక్రయించాల్సి ఉంటుందని తెలిపారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల స్వచ్ఛత కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో దామోదర్

చిన్నశంకరంపేట, ఆగస్టు 13: గ్రామాల స్వచ్ఛత కోసం పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు కృషి చేయాలని ఎంపీడీవో దామోదర్ సూచించారు. మంగళవారం చిన్నశంకరంపేట ఎంపీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో అందుబాటులో ఉండి గ్రామ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎంపీవో గిరిజారాణి, ఏపీవో లక్ష్మీనారాయణ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

నేడు, రేపు తాగునీటి సరఫరాకు అంతరాయం

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 13: సంగారెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో ఈ నెల 14, 15 తేదీల్లో తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. మిషన్ భగీరథ శాఖ పరిధిలోని పోలకంపల్లి, బుధేర గ్రామాల పరిధిలో లీకేజీల కారణంగా 48 గంటల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. తిరిగి యథావిధిగా 16 వ తేదీన మంచి నీటి సరఫరా ఉంటుందని, పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా లైబ్రేరియన్ల దినోత్సవం

నర్సాపూర్, ఆగస్టు 13: నర్సాపూర్ సమీపంలోని బీవీఆర్ఐటీలో మంగళవారం జాతీయ లైబ్రేరియన్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ గ్రంథాలయ పితామహుడు రంగనాథన్ చిత్రపటానికి నివాళి అర్పించి గ్రంథాలయ ఆవశ్యకతపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కెమికల్ బ్రాంచీ విభాగధిపతి రాధిక, మేనేజర్లు బాపిరాజు, అశోక్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లకార్డులతో కళాశాల సిబ్బంది నిరసన

నాగల్‌గిద్ద, ఆగస్టు 13: గత 11 సంవత్సరాల నుంచి తాము విధులు నిర్వహిస్తున్నా ఇప్పటివరకు బదిలీ చేపట్టడం లేదంటూ మండల పరిధిలోని మోర్గి మోడల్ కళాశాలలో మంగళవారం ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వంస్పందించి తమకు బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాలప్రిన్సిపల్ రమేష్, సిబ్బందిపాల్గొన్నారు.

అబ్బెందలో మెగా రక్తదాన శిబిరం

నారాయణఖేడ్, ఆగస్టు 13: మండల పరిధిలోని అబ్బెంద పంచాయతీ కార్యాలయంలో గ్రామానికి చెందిన హన్మంత్‌రావుపేట సుధీర్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని సుధీర్ మిత్రుల టీం ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 23 మంది రక్తదాతలు తమ రక్తాన్ని దానం చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి శిబిరాన్ని సందర్శించారు.

బాధితుడికి ఎల్‌వోసీని అందజేత



బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ పత్రాన్ని అందిస్తున్న ఎంపీ

నారాయణఖేడ్, ఆగస్టు 13: పెద్దశంకరంపేటకు చెందిన గంగారెడ్డి భార్య అస్వస్థతకు గురై వైద్యశాలలో చేరడంతో, వైద్యం కోసం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ రూ.5 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈ మేరకు గంగారెడ్డికి మంగళవారం ఎల్‌వోసీ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సత్యం, తదితరులు ఉన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

మనోహరాబాద్, ఆగస్టు 13: రైతు నేస్తం ద్వారా రైతులకు పంటల పై మనోహరాబాద్ రైతు వేదికలో మండల వ్యవసాయ అధికారి అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి స్రవంతి, నర్సాపూర్ ఏడీఏ సంధ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆన్‌లైన్‌తో రైతులకు పంటల పై అవగాహన కల్పించారు.

అల్లాపూర్‌లో ఘర్‌ఘర్ తిరంగా

తూప్రాన్, ఆగస్టు 13: తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ పాఠశాలలో మంగళవారం ఘర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పాఠశాలలో జాతీయ జెండాలను చేతిలో పట్టుకొని ప్రదర్శన చేశారు. ఇంటి మీద ఎగురవేసేందుకు జెండాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయండి



సంగారెడ్డి అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతాప్రభాకర్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 13 : ట్రిపుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. సంగారెడ్డిలో మంగళవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్నదాతలకు ఆధారంగా ఉన్న కొద్దిపాటి భూములను లాక్కుంటే వారు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. నమ్ముకున్న భూమి రోడ్డుపాలైతే అన్నదాతలు ఆగమవుతారని, రైతులకు భూమికి భూమి ఇచ్చి న్యాయం చేయాలన్నారు. భూ నిర్వాసితులు తొందర పడకుండా ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని, న్యాయం జరిగేవరకు మనోధైర్యంతో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. రైతన్నల పక్షాన బీఆర్‌ఎస్‌పార్టీ నిలుస్తుందని రైతులకు విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యేకు తిరంగా అందజేత

సాంస్కృతిక పర్యాటక శాఖ నుంచి వచ్చిన త్రివర్ణ పతాకం(జాతీయ జెండా)ను సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం పోస్టల్ శాఖ అధికారులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి పోస్టల్ శాఖ సూపరింటెండెంట్ ఎల్‌వీ మురళి కుమార్, ఆర్‌సీపురం, జహీరాబాద్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు సావిత్రి, రఘువీర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ స్వాగతిక పాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం: మెదక్ ఎమ్మెల్యే



చిన్నశంకరంపేట: ధర్పల్లిలో హల్దీవాగు ఎడమ కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్, నాయకులు

చిన్నశంకరంపేట, ఆగస్టు 13: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సూరారం, ధర్పల్లి గ్రామాలలో ఎమ్మెల్యే పర్యటించారు. సూరారం గ్రామంలోని ఇటీవల జ్వరంతో మృతి చెందిన బాలుడి కుటుంబీకులను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ధర్పల్లి గ్రామంలోని పాఠశాలను సందర్శించి విద్యాబోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల స్థితిగతులపై ప్రధానోపాధ్యాయుడిని అడిగి, రికార్డులను పరిశీలించారు. అనంతరం హల్దీ ప్రాజెక్ట్ ఎడమ కాలువను పరిశీలించారు. కాలువ నుంచి నీరు సరఫరా చేయించాలని గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం గ్రామాల అభివృద్ధిపై నాయకులతో సమీక్షించారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సన్నద్ధం కావాలని, పార్టీ బలోపేతం కోసం కాంగ్రెస్ కార్యకర్తలు శాయశక్తులా కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

మెదక్ అర్బన్, ఆగస్టు 13: ఆపదలో ఉన్న వారిని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు భరోసా ఇచ్చారు. గత నెల జూలై 28న జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన సాత్విక్ కుటుంబ సభ్యులతో పాటు స్థానిక గాంధీనగర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయిన పూరి గుడిసె బాధితులను మంగళవారం ఆయన పరామర్శించారు. రెండు కుటుంబాలకు ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, పట్టణ అధ్యక్షుడు అంజనేయులుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు జాతీయ పతాకం అందజేత

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావుకు తపాలాశాఖ అధికారులు మంగళవారం జాతీయ పతాకాన్ని అందజేశారు.

చెరువుల పరిరక్షణకు తీసుకున్న చర్యలేంటి?

- కమిషనర్‌ను ప్రశ్నించిన తెల్లాపూర్ నాయకులు

రామచంద్రాపురం, ఆగస్టు 13: చెరువుల పరిరక్షణకు తీసుకున్న చర్యలేంటంటూ మంగళవారం తెల్లాపూర్ ఐక్య వేదిక నాయకులు మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. తెల్లాపూర్‌లోని మేళ్ల, వనం, చెలికుంట చెరువులను పరిరక్షించాలని గతవారం ఇచ్చిన వినతిపత్రంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారంటూ అడిగారు. మున్సిపాలిటీ పరిధిలో ఎన్ని అపార్టుమెంట్లకు, ఎన్ని విల్లాల సముదాయాలకు ఎస్‌టీపీలు ఉన్నాయో తెలుపాలని కోరారు. చాలావరకు ఎస్‌టీపీల నిర్మాణాన్ని చేపట్టని సంస్థలు నేరుగా చెరువుల్లోకి మురుగునీటిని విడుస్తున్నాయన్నారు. ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలను అడ్డుకోవాలని కోరారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలోని నిర్మాణ సంస్థలకు ఎస్‌టీపీల విషయమై వివరణ కోరుతూ నోటీసులు పంపామన్నారు. కాలువలు, కుంట లు, చెరువులకు సంబంధించిన నివేదికలను సంబంధిత అధికారుల నుంచి నివేదికలు తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ సంగారెడ్డి పేర్కొన్నారు. కమిషనర్‌ను కలిసినవారిలో నాయకులు రాజిరెడ్డి, పావని, బుచ్చిరెడ్డి, శ్యాంరావు, సీపీరెడ్డి, అరుణ్‌గౌడ్, రవీందర్, నవారి శ్రీనివాస్‌రెడ్డి, ఐలేష్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి



ఖేడ్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థుల నిరసన

నారాయణఖేడ్,ఆగస్టు 13: ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం నారాయణఖేడ్ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్ మైదానం నుంచి విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజీవ్ చౌక్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి యశ్వంత్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.8,200 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

మహిళా సంఘాల డబ్బును సొంతానికి వాడుకున్న ఐకేపీ వీవోఏ

కొడిపల్లి, ఆగస్టు 13: మహిళాసంఘం సభ్యులు తాము తీసుకున్న లోన్‌కు సక్రమంగా చెల్లింపులు చేసినా ఆ డబ్బులను బ్యాంకులో జమ చేయాల్సిన ఐకేపీ వీవోఏ తన సొంతానికి వాడుకున్న ఘటన మండలంలోని రాజీపేట గ్రామంలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని రాజీపేట గ్రామానికి చెందిన ధనలక్ష్మి మహిళాసంఘం అధ్యక్షురాలు యాదమ్మ మాట్లాడుతూ.. సభ్యులు గత ఏడాది రూ. 10లక్షలు లోన్ తీసుకొని ప్రతి నెలా రూ.32,000 బ్యాంకుకు చెల్లిస్తున్నారు. ఇదే క్రమంలో గ్రామానికి చెందిన వీవోఏ తాను డబ్బులు చెల్లిస్తాను అని చెప్పి మహిళాసంఘం సభ్యుల వద్ద డబ్బు తీసుకొని బ్యాంకుకు చెల్లించలేదు. కొంత కాలానికి అనుమానంతో బ్యాంకులో విచారించగా వీవోఏ డబ్బులు బ్యాంకులో జమచేయలేదనే విషయం బయటపడింది. దీంతో సదరు మహిళా సంఘాలసభ్యులు వీవోఏను నిలదీయగా వాస్తవానికి తనకు అవసరం ఉండి వాడుకున్నానని చెప్పి బ్యాంకులో డిపాజిట్ చేసినట్టు తెలిపారు. లోన్ తీసుకునే సమయంలో రూ. లక్షకు గాను వెయ్యి ఇస్తేనే లోన్ ఇప్పిస్తున్నారని, లేని పక్షంలో అనేక ఇబ్బందులు సృష్టించి లోన్ వచ్చినా వీవోఏలు తమ వద్దనే డబ్బులు పెట్టుకొని ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ విషయం ఐకేపీ అధికారులకు తెలిసినా సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆరు నెలల వరకు తమ డబ్బులు వాడుకోవడంతో తాము వడ్డీ చెల్లించాల్సివస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని గ్రామాల్లో వీవోఏలు ఇదేవిధంగా చేస్తున్నాఅధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఇదే విషయంపై ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్‌ను వివరణ కోరగా.. రాజిపేట వీవోఏ ఆరు నెలల పాటు మహిళా సంఘం డబ్బులు వాడుకున్నది నిజమేనని తెలిపారు. ఈ విషయం బయటకు పొక్కడంతో తిరిగి బ్యాంకులో డిపాజిట్ చేశాడని తెలిపారు. ఇకముందు ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా చూస్తామన్నారు.

ఈత కోసం వెళ్లిన వ్యక్తి మృతి



మహమ్మద్ ఇలియాస్(ఫైల్)

పెద్దశంకరంపేట, ఆగస్టు 13: మద్యం మత్తులో ఈతకు వెళ్లిన వ్యక్తి నీట మునిగి మృతి చెందాడు. ఈ ఘటన పెద్దశంకరంపేట పట్టణ శివారులోని ఇసుక మడుగులో మంగళవారం చోటు చేసుకున్నది. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాలు ప్రకారం.. పెద్దశంకరంపేటలోని ఇందిరాకాలనీకి చెందిన లారీ డ్రైవర్ మహమ్మద్ ఇలియాస్(30) ఈ నెల 12న సాయంత్రం తన స్నేహితులైన నాందేడ్ యాదగిరి, ఎండీ షాదుల్, సుల్తాన్‌లతో కలిసి పేట శివారులోని ఇసుకమడుగు వద్ద మద్యం తాగాడు. అనంతరం మడుగులో ఈత కొట్టడానికివెళ్లగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికులు ఇసుక మడుగులో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం గజ ఈతగాళ్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం జోగిపేట ప్రభుత్వ వైద్యశాలకి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడితల్లి మహమ్మద్ హసీనాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



కరుణాకర్‌రెడ్డి(ఫైల్)

నర్సాపూర్,ఆగస్టు 13: కుటుంబ కలహాలతో నర్సాపూర్‌లో ఓ కేబుల్ నిర్వాహకుడు మంగళవారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్‌కు చెందిన కరుణాకర్‌రెడ్డి, అంజలి దంపతుల మధ్య కొంత కాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కరుణాకర్‌రెడ్డి ఇంట్లోనే చీరతో ఉరివేసుకున్నాడు. కుటుంబీకులు వెంటనే నర్సాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్ ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా అందరితో కలుపుగోలుగా ఉండే కరుణాకర్‌రెడ్డి మృతి చెందడంతో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డితో పాటు పలువురు నాయకులు, స్నేహితులు పెద్దఎత్తున ఆసుపత్రికి తరలివచ్చి సంతాపం వ్యక్తం చేశారు.

బొల్లారంలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

జిన్నారం, ఆగస్టు 13: బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. మంగళవారం బొల్లారం పట్టణ శివారులో(35) సంవత్సరాల మహిళ మృతదేహాన్ని గుర్తించామని, కుళ్లిన స్థితిలో మృతదేహం ఉన్నట్లుగా తెలిపారు. ఈ విషయమై స్థానికులు, ఇతరులు సమాచారం కోసం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

కాళ్లకల్‌లో వివాహిత అదృశ్యం



పుప్పల వరలక్ష్మి

మనోహరాబాద్, ఆగస్టు 13: ఊరు వెళ్లిన వివాహిత మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధిలో కాళ్లకల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామంలో వివాహిత పుప్పల వరలక్ష్మి(25) ఊరికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. భర్త పుప్పల నాగరాజు తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి గత కొంత కాలంగా కాళ్లకల్ గ్రామంలో బేకరీ షాపు నడుపుతూ కాళ్లకల్ గ్రామంలో కుటుంబంతో కలసి జీవిస్తున్నారు. ఏపీలోని మస్కపల్లి మండలం, అమలపురం గ్రామానికి చెందిన పుప్పల వరలక్ష్మి సొంత ఊరికి వెళ్తున్నట్టు ఇంట్లో చెప్పి ఈ నెల 3వ తేదీన ఇంటి నుంచి బయలుదేరింది. ఆమె భర్త ఫోన్ చేయగా మళ్లీ ఫోన్ చేయకు అని చెప్పి ఫోన్ స్విచాఫ్ చేసింది. మంగళవారం భర్త పుప్పల నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదవశాత్తు లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం



బోల్తా పడిన లారీ

కోహీర్, ఆగస్టు 13: మండల పరిధిలోని దిగ్వాల్ గ్రామంలో గల 65వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న స్క్రాప్ లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగనప్పటికీ సర్వీస్ రోడ్డులో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గ్రామానికి చెందిన తలారి నగేష్ కాలుకి గాయమైంది. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం నిమిత్తం హైదరాబాద్ తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూశారు.

విద్యార్థుల భవిష్యత్ మార్చేది చదువే: డీఈవో

మునిపల్లి, ఆగస్టు 13: సమాజంలో విద్యార్థుల జీవితాలను మార్చేది చదువేనని సంగారెడ్డి జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. టీచర్లు రాజేశ్వరి, కృష్ణవేణి, క్యూ పీఎస్ కంపెనీ సహకారంతో మంగళవారం మండల పరిధిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు టీ షర్ట్స్, బెల్టులను డీఈవో వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దాతలు సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మారెడ్డి, మండల నోడల్ ఆఫీసర్ భాస్కర్, ఏజీపీసీ చైర్మన్ అనసూయ, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండని ఎంఈవోపై చర్యలు తీసుకోండి

- డీఈవోకు ఏఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 13: అందుబాటులో ఉండని కల్హేర్ మండలం మండల విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం ఏఎస్ఎఫ్ఐ నాయకులు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దత్తు మాట్లాడుతూ బీబీపేట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయినా ఎంఈవో స్పందించలేదని అన్నారు. విద్యార్థుల బాగోగులు చూడాల్సిన అధికారి సమయపాలన పాటించకుండా అందుబాటులో ఉండకుండా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. సదరు ఎంఈవోపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దాతల చేయూత విద్యార్థుల భవితకు పునాది

మెదక్ కల్చరల్, ఆగస్టు 13: సిద్దార్థ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ శ్రీనివాస్ చౌదరి సహకారంతో మాచవరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆకట్టుకునే కలర్ స్పోర్ట్స్ యూనిఫామ్స్ ఐడీ కార్డులు అందించడం అభినందనీయమని డీఈవో రాధా కిషన్ అన్నారు. ఈ సందర్భంగా దాత మాచవరం పాఠశాల పూర్వ విద్యార్థి, సిద్దార్థ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ అయిన శ్రీనివాస్ చౌదరి మాట్లాడుతూ.. ఈ పాఠశాల అభివృద్ధికి తాను ఎల్లవేళలా ముందుటానన్నారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలను దూరంగా ఉండాలి

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 13: యువత మత్తు పదార్థాలను దూరంగా ఉండాలని తారా కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ సూచించారు. సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండడమే కాకుండా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా.జగదీశ్వర్, అధ్యాపకులు విధున్‌రాథోడ్, డా.నాగప్రసాద్, కామర్స్ విభాగాధిపతి డా.వీరేందర్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలన అందరి బాధ్యత

- న్యాయాధికార సంస్థ కార్యదర్శి రమేష్

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 13: మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ బాధ్యతగా భావించి ఆ దిశగా కృషి చేయాలని న్యాయాధికారి, న్యాయాధికార సంస్థ కార్యదర్శి రమేష్ అన్నారు. సంగారెడ్డి మండలం కొత్లాపూర్, కంది మండలం మామిడిపల్లిలోని జడ్పీహెచ్‌ఎస్‌లలో, సంగారెడ్డిలోని స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో మంచి ఎంత ఉందో చెడు ప్రభావం కూడా అంతే ఉన్నదని, ఏమైనా సమస్యలు ఎదురైతే 100, 181, 1098 హెల్ప్‌లైన్ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు బాధ్యత వహిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి లలిత కుకమారి, ఎక్సైజ్ శాఖ అధికారి నవీన్ చంద్ర, సాధికారత కేంద్ర సమన్వయకర్త పల్లవి, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.